# మార్పు అవసరం

గొరుసు జగదీశ్వరరెడ్డి

**ఆఫీస్‌లో అడుగుపెట్టే సరికి ఎదురుగా వున్న వాల్‌క్లాక్ పదిగంటల పది నిమిషాలు చూపిస్తోంది. హేండ్‌బేగ్‌ని డెస్క్‌లో పడేసి, కొద్ది దూరంలో వున్న వాటర్ కూలర్ దగ్గరికి వెళ్తున్న నాకు పక్క డిపార్ట్‌మెంట్‌లో అప్పటికే వచ్చి, టైప్ చేసుకుంటున్న మృణాళిని కన్పించింది. నీళ్ళు తాగి వస్తూ పలకరించేను.**

"హలో...వసుంధరా, నీ కోసమే చూస్తున్నాను. నీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. మరేమీ అనుకోనంటేనే సుమా" టైప్ చేయటం ఆపేస్తూ అంది.

మృణాళిని మాటలకు ఆశ్చర్య పోయాను. ఎందుకంటే....నాతో తనెప్పుడూ ఇట్లా తటవటాయిస్తూ మీమాంసతో మాట్లాడదు.

"నేననుకోవటం ఏమిటీ, చెప్పాల్సిన విషయం నిర్భయంగా చెప్పు" భరోసా ఇచ్చేను.

"నిన్న సాయంత్రం మన ఆఫీస్‌కి మీ పక్కింటి రాజశేఖరంగారొచ్చి, హరిహరకళాభవన్‌లో బిమల్‌రాయ్ సినిమాలు వేస్తున్నారని చెప్పి నిన్ను తీసుకెళ్ళారా! అలా మీరిద్దరూ వెళ్ళారో లేదో మన హెడ్ క్లర్క్ మారుతీరావు మీ ఇద్దరి గురించి ఛండాలంగా వాగుతుంటే విన్నానే. నీవూ, రాజశేఖరంగారూ అడ్డమైన తిరుగుళ్ళూ తిరుగుతారని అర్థం వచ్చేలా కూసేడు రాస్కెల్. మారుతీరావు మీ ఇంటి ఎదురుగానే వుంటాడు కదా.... మీ వారితో చెప్పి ఓసారి వాడి నోరు మూయిస్తే బావుంణ్ణు...." మృణాళిని చెప్పటం ఆపి, నా కళ్ళల్లోకి చూసింది.

"ఆపేసేవేం?" నవ్వుతూ అన్నాను.

"అదేమిటే, ఆ వెధవ అంతేసి మాటలంటుంటే బాధేయటం లేదూ!"

"మనం బాధపడ్డామని తెలిస్తే, అతను అనటం మానేస్తాడా"

"అట్లాకాదు. బుద్ధి చెప్పాలి"

"బుద్ధి చెప్పాల్సింది మనుషులకి మాత్రమే...." అతడన్న మాటల్ని అంతగా పట్టించుకోవద్దని మరోసారి చెప్పి, నా సీట్లోకి వచ్చి కూర్చున్నాను.

మారుతీరావు మాటలకి నాలో ఏరకమైన స్పందనా వ్యక్తం కాకపోవటంతో మృణాళిని చాలా నిరాశపడినట్లు గమనించకపోలేదు.


ఫైల్స్ తిరిగేస్తున్న నేను మారుతీరావు పలకరింపుకి తలెత్తి చూసేను.

"నిన్న బిమల్‌రాయ్ సినిమా కెళ్ళినట్లున్నారు. ఏ సినిమా మేడమ్." అడిగే తీరులో వ్యంగ్యం. ఇంకేమన్నా అడుగుతాడేమోనని ఆయనవైపే చూసేను. ఎందుకో నా పెదాలపై అనుకోకుండా దరహాసం.....ఆ మొహమూ, గుణమూ సార్థక నామధేయం అన్పించింది.

నేను సమాధానం ఇవ్వకుండా వుండటంతో కొంత ఖంగుతిన్నట్లుగా

"అదేనండీ, నిన్న రాజశేఖరంగారితో కలిసి వెళ్ళారుగా" వత్తి పలుకుతూ అన్నాడు. నోటితో మాట్లాడ్తూ, నొసటితో వెక్కిరించే తత్వం మారుతీరావు స్వంతం.

నిన్న మేం ఇద్దరం 'మధుమతి' సినిమాని చూసినా ఆ విషయం మారుతీరావుకి చెప్పాలనిపించలేదు. కాస్త ఆట



పట్టిస్తే బావుంటుందనిపించింది.

"నిన్న హరిహర కళాభవన్‌కనే బయల్దేరాం. తీరా అక్కడికి వెళ్ళాక సినిమాకి వెళ్ళాలనిపించక, పరేడ్ గ్రౌండ్స్‌లో నడుస్తున్న ఎగ్జిబిషన్‌కెళ్ళాం." ప్రతీ పదాన్ని ఊరిస్తూ చెప్పాననిపించింది. అబద్ధాన్ని కల్పించి చెప్పేసరికి మానవుడి ముఖం పాలిపోయింది. మరేవో ఆఫీస్ విషయాల్ని అడిగి తన సీట్లోకి నెమ్మదిగా వెళ్ళి కూర్చున్నాడు.

కాలంతో పాటూ మనుషులు మారకపోవటం, ఎంతేసి పెద్ద చదువులు చదివినా ఇంకా కుసంస్కారంతో ప్రవర్తించడం.... తన జీవితంకన్నా పక్కవాడి జీవితం ఎంతో ముఖ్యమైనట్లు వాళ్ల స్వంత విషయాల్లో జోక్యం చేసుకొని, ఆరాలు తీస్తూ, మొసలి కన్నీరు కారుస్తూ, చచ్చు సలహాలు ఇవ్వటం.... ఇలాంటి మనుషుల్ని చూస్తుంటే గొప్ప దిగులేస్తూ వుంటుంది.

మారుతీరావు, నేనూ పదేళ్ళుగా ఒకే ఆఫీస్‌లో పని చేస్తున్నాము. మేనేజ్‌మెంట్ మాకై స్వంతంగా కట్టించిన ఇళ్ళలోకి ఏడాది క్రితం మారేం. నా అదృష్టం కొద్దీ మారుతీరావు మా ఎదురింటి వాడు. మా ఇంటికి ఎడం పక్కన సుధాకర్ అనే మరో కోలీగ్‌కు అలాట్ అయింది. తను ఉద్యోగానికి రిజైన్ ఇచ్చేసి, స్టేట్స్‌కి వెళ్తూ తన ఇంటిని అమ్మకానికి పెట్టాడు. అప్పట్లో మా వారి కోలీగ్ రాజశేఖరంగారు ఓ ఇల్లు కొనాలనే ప్రయత్నంలో వుండటం, మా వారు మధ్యవర్తిగా వుండి ఇల్లు కొని పెట్టడం జరిగింది.

నేను అంతకు ముందు రాజశేఖరంగార్ని చూసి ఎరగను. మా పక్కింట్లోకి వచ్చేకే పరిచయం కల్గింది. అతని భార్య రేవతి, ఆరేళ్ళ పాప ప్రణవి వచ్చిన కొన్నాళ్ళలోనే మాలో ఒకరైపోయినట్లు కలిసిపోయారు.

రేవతిలో ఏర్పడిన చనువు ఎన్నో ఏళ్ళుగా పరిచయంలా తోస్తుంది. రాజశేఖరం గారితో నాకు బాగా స్నేహం ఏర్పడటానికి గల కారణం ముఖ్యంగా నాలాగే తనకూ సాహిత్యం పట్ల శ్రద్ధ వుండటం అనుకుంటాను.

మంచి సాహిత్యం సేకరించటం అతని హాబీ. ఇద్దరం ఏదైనా ఓ పుస్తకం గురించి డిస్కషన్ మొదలెట్టామంటే కాలం తెలీదు. ఒకపక్క మావారు మరో పక్క రేవతి మా సంభాషణకి విసిగెత్తి గోలపెట్టేవాళ్ళు.

ఒక్కోసారి మా ఇద్దరిమీద, మా సాహిత్య పిచ్చి గురించి జోకుల్ని సృష్టించి పేల్చేవారు.

అప్పుడప్పుడూ రవీంద్రభారతిలోగానీ, లలితకళా తోరణంలోగానీ... మంచి ప్రోగ్రామ్స్ జరిగితే అందరం కలసి వెళ్ళేవాళ్ళం.

మా వారికి వీలు దొరక్కపోతే రాజశేఖరంగారితో కలిసి అప్పుడప్పుడూ వెళ్ళేదాన్ని. రేవతి ఊర్లో లేకపోవటంతో, మా వారు టూర్‌లో వుండటంతో తనొక్కడే వెళ్ళడం దేనికని నిన్న ఆఫీస్‌కి వచ్చి, బిమల్‌రాయ్ సినిమాకని నన్ను తనతో తీసుకెళ్ళటం పై.... మారుతీరావు ఇంత రభస చేస్తాడని ఊహించలేదు.

మంచి పిక్చర్స్ చూడాలన్న అభిలాషతో మేం నల్గురం ఫిలిం క్లబ్ మెంబర్స్‌గా సభ్యత్వం తీసుకున్నాం....కాబట్టి వీలునిబట్టి వెళ్తాం. ఇలా మారుతీరావులని పట్టించుకుంటూ పోతే.....అడుగడుక్కి ఈ వానరజాతి ఉంటుందనిపించింది.

* * *

మధ్యాహ్నం ఒంటి గంట దాటింది.

అంతకు ముందే క్యాంటీన్‌కి వెళ్ళి, లంచ్ అయిందనిపించి....వచ్చి కూర్చున్నాను. నా వెనక వైపున వున్న బీరువాల వరస అవతల మారుతీరావు అండ్ పార్టీ కూర్చుని వుంది. బహుశా నేను లంచ్ చేసి వచ్చి కూర్చున్నానని....... గమనించి వుండడు.

"అవునోయ్ మారుతీరావ్, ఈ మధ్య మన మృణాళిని గమనించేవా..... నెరిసిపోయిన తలవెంట్రుకలకి

డైవేసుకుంటుందోయ్. ముసలమ్మ పడుచుపిల్లగా మారడానికి తంటాలు పడుతోంది. బహుషా వాళ్ళాయన పై తిరుగుళ్ళు తిరక్కుండా తన మీద మోజు తగ్గకుండా జాగ్రత్తపడుతోంది కాబోలు" మారుతీరావు బ్రదరెవరో అంటున్న మాటలు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

అందరూ గొల్లున నవ్వేరు. ఆ రోజు మృణాళిని సెలవు పెట్టడం జరిగింది. అదన్నమాట సంగతి! మనుషులు ఎదురుగా లేకపోతే ఇలా నీచపు కబుర్లన్నీ చెప్పుకుంటారు.

"అది నరేనోయ్ సుబ్రావ్, ఇప్పుడ్నేను చెప్పబోయే విషయం వింటే..... అదిరిపోతావోయ్.....మన వసుంధరగారి సంగతోయ్" మారుతీరావు మాటలకు అదిరిపడ్డాను. ఇప్పుడు నా గురించి వాగుతాడు కాబోలు. ఎంత నిగ్రహించుకుందామనుకున్నా..... మనసు కలతబారుతోంది.

"ఆవిడగారు లంచ్ చేసి వచ్చేలోగా చెప్పేస్తానోయ్" వాళ్ళు నన్ను మరో మార్గం లోంచి రావటం గమనించలేదన్నది తెలిసిపోతోంది.

"నిన్న సాయంత్రం డాబాపైన పచార్లు చేస్తున్నానోయ్. మా ఇంటి డాబాపై నుండి చూస్తే వసుంధర ఇంట్లో ఏం జరుగుతుందో అంతగా కన్పించకపోయినా, వాళ్ళ వరండాలో ఏం జరిగేది కళ్ళకు కట్టినట్టుగా కన్పిస్తుందోయ్. వసుంధర, ఆ పక్కింటి రాజశేఖరం కలిసి వరండాలోని కుర్చీల్లో కూర్చుని ఒకటే మాటలోయ్ పగలబడి నవ్వుకోడాలు కూడా. పాపం! వసుంధర మొగుడు.....ఫ్చ ఒఠ్ఠి అర్భకుడోయ్. ఇంట్లోంచి వేడి వేడి పకోడీలు, కాఫీలు తయారుచేసి వీళ్ళకి అందిస్తున్నాడు......నిజం చెప్పొద్దూ....ఆయన్ని చూస్తే గొప్ప జాలేసిందోయ్, పూర్ ఫెలో"

"పాపం పెరిగిపోతోందర్రా. అట్లా చూస్తూ ఎట్లా వూరుకుంటున్నావోయ్ మారుతీరావ్. ఒకే కాలనీ వాళ్ళుకదా మీరంతానూ. సంసార్లుండే కొంపలాయె. కాస్త పెద్ద మనిషితరహాలా మందలించక పోయావుటోయ్" మారుతీరావుకి మరోహాడు ఆజ్యం పోస్తున్నాడు.

వింటున్న నాకు చెమటలు పడుతున్నాయ్. అది వాళ్ళ ధోరణని తెలిసినా, మనసులో ఏదో గాబరాగా వుంది.

"మొన్న ఆ రాజశేఖరంతో కలసి, మనముందు నుండే అతని స్కూటర్ వెనగ్గా కూర్చుని ఎట్లా వెళ్ళిందోయ్. ఈ విషయం వాళ్ళాయన చెవిలో వేయలేకపోయావా" ఆ మాటలకి మారుతీరావు అడ్డుపడ్డాడు.

"ఎంత పిచ్చోడివోయ్ మస్తాన్‌రావ్....ఆయన లూజ్ వల్లేకదుటోయ్ ఈవిడ ఆగడాలు. పిల్లి గుడ్డిదయితే ఎలుక భరతనాట్యం చేస్తుందోయ్. ఎదురింటి వాళ్ళనీ, పదేళ్ళుగా ఒకే ఆఫీస్‌లో వర్క్ చేస్తున్న వాళ్ళం అని ఆలోచిస్తున్నానుగానీ......వాళ్ళను కాలనీ నుండి వెళ్ళగొట్టడం ఎంత పనోయ్" కాలనీ తన తాత సొత్తయినట్లు..... వాగుతున్నాడు.

నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది. పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. వాళ్ళ మాటలకు ఎంత రెచ్చిపోవాలో అంతగా రెచ్చిపోయాను.

ముల్లుని ముల్లుతోనే తీయటం సబబనిపించింది.

ఒక్క ఉదుటున సీట్లోంచి లేచాను. నన్ను చూసిన వాళ్ళందరి నోళ్ళూ ఒక్కసారి మూతలుపడ్డాయి. అంత వరకూ వాగిన మొఖాల్లో తత్తరపాటుతనం.

బలవంతంగా నవ్వు పులుముకొని, టాపిక్ మార్చబోయారు.

"వసుంధర గారూ అప్పుడే లంచ్ అయిపోయిందా. ఎప్పుడొచ్చారో...గమనించ లేదు సుమండీ...."

'హిహిహి' పళ్ళికిలించేడు మారుతీరావు.

"ఇప్పుడ్రావటం ఏమిటీ.....మృణాళిని హెయిర్ డై గురించి మీరు తర్జన భర్జనలు జరుపుకుంటున్నప్పుడే వచ్చాను" టిక్కచచ్చాడు నా మాటలకి.

తేలు కుట్టిన దొంగలా మొహం పెట్టేడు.

"అది నరే మారుతీరావుగారూ. నిన్న మీ పాపకి జ్వరం అని చెప్పింది మీ ఆవిడ. ఇప్పుడెట్లా వుందో....." మామూలు ధోరణిలో అడిగేను.

"ఆc......ఇంకా తగ్గలేదండీ. ఏదీ ఆఫీసు నుండి వెళ్ళేసరికి చాలా ఆలస్యం అవుతోంది కదండీ! హాస్పిటల్‌కి తీసుకెళ్ళటం కుదర్లేదు. ఇవ్వాళ చూడాలి" నాకు కోపం రాలేదనుకొని కొంత నవ్వు పులుముకున్నాడు మొహం మీద.

"మారుతీరావుగారూ ఇక మీరేమి అనుకోనంటే ఒక మాట. ఇంట్లో మీ పాపకు జ్వరంగా వున్నా.... మీ జీవితానికి సవాలక్ష సమస్యలున్నా.....అవేవీ తమరికి ముఖ్యం కాదన్నమాట. మృణాళిని హెయిర్ డై వేసుకోవటం, వసుంధర పక్కింటి రాజశేఖరం స్కూటర్ ఎక్కి వెళ్ళటం.....ఇవీ...ఇవీ మీకు ముఖ్యం" ఆవేశాన్ని అదుపులో వుంచుకునే అన్నాను.

అంత మంచి భర్త దొరికినందుకు నా మీద నాకే జెలసీ కల్గిన క్షణాలవి. మారుతీరావు, రాజశేఖరం, మా వారూ... అంతా మగవాళ్ళే. మరి వాళ్ళ భావజాలంలో ఎంత మార్పు? వీళ్ళిద్దరి సంస్కారం హిమాలయంలా కన్పిస్తుంటే మారుతీరావు సంస్కారం అధఃపాతాళంలో వున్నట్లు అన్పించింది.

"మీరు పరాయి మగాడితో స్కూటర్‌పై వెళ్ళారని...... వీళ్ళంతా చూసి అనుకుంటుంటే......"నీళ్ళు నమిలేడు.

"తమరు వత్తాసు పలికేరు. ఔనా! పరాయి మగాడంటే మీ దృష్టిలో ఏమిటసలు! మగవాళ్ళు స్నేహితులు కాకూడదా. ఆయన్తో స్కూటర్‌పై వెళ్తే మీకొచ్చిన నష్టం ఏ వుంది? నా గురించి ఇంత ఆలోచిస్తున్నారంటే.... ఆశ్చర్యంగా వుంది. ఒక్కసారి మీ స్వవిషయాల్లోకి తల దూర్చండి. మంచంలో పక్షవాతంతో వద్ద మీ నాన్నగారూ, పెళ్ళి కావలసిన మీ చెల్లెలూ, వంటింట్లో నానుతున్న నీ భార్యా, మార్కులు సరిగ్గా తెచ్చుకోలేక పోతున్న నీ కొడుకూ...ఇవన్నీ మీ సమస్యలు కావా? ఈ సమస్యలన్నీ మీరు బయటపెట్టుకున్నవే. ఇన్ని సమస్యలు వున్నా పట్టనట్టు.... పక్కవారి జీవితాల్లోకి తొంగి చూసే వక్రబుద్ధిని మీరు మార్చుకోవాలి. నా పట్ల, మృణాళిని పట్ల చూపే శ్రద్ధలో కొంత శాతం మీ సమస్యలపై చూపండి.....మీ అందరికీ ఇన్నేళ్ళ వయస్సొచ్చి, బరువూ, బాధ్యతల్ని మోస్తున్నా.... ఇంకా ఇదేం సంస్కారం? మీ పిల్లలకు కూడా ఇదే వారసత్వం అంటగడతారా! ఒక్కోసారి ఆఫీస్‌కి ఆలస్యం అవుతా.... మా వారు లేని పక్షంలో రాజశేఖరంగారు లిఫ్ట్ ఇస్తుంటారు. అది పెద్ద తప్పు మీ దృష్టిలో. మీరు పెరిగిన వాతావరణం ఏదైనా కావచ్చు. మీరు చదివిన చదువు నేర్పిన సంస్కారం ఇదికాదే!

ఇక నుండయినా.....పై వాళ్ళ జీవితాల్లోకి తలదూర్చటం మానేయండి. మీ వాళ్ళ కోసం సమయాన్ని కేటాయించటం నేర్చుకోండి....." నా మాటల్ని వింటున్న మారుతీరావు మొహంలో రకరకాల భావజాలం పెల్లుబుకుతోంది. దులపాల్సిన నాలుగు మాటలు అన్న తర్వాత మనసు తేలికనిపించింది.

తర్వాత కొన్నాళ్ళ దాకా మారుతీరావు నాతో మాట్లాడ్డం మానేసేడు. నన్ను చూడగానే మొహం తప్పించేవాడు. అందరి ముందూ తలవాచేట్లు నాచేత చీవాట్లు తిన్నా.... మనిషిలో కించిత్తు మార్పయినా రాలేదని గమనించేను.

నా గురించి, మృణాళిని గురించి మానేసి, మా పక్క సెక్షన్‌లో పన్జేస్తున్న మాధురి, రమ్యల గురించి ఆరాలు తీయటం మొదలెట్టారు.

'ఇంత నీతిమాలిన మనుషులు అంతటా వుంటారా' అనే అనుమానం కల్గేదొక్కోసారి.

మారుతీరావు భార్య కూడా నాతో మాట్లాడ్డం మానేసింది. వాళ్ళ పిల్లలు, చెల్లి కూడా మా ఇంటికి రావటం మానేసారు. దీనికంతటికి కారణం మారుతీరావుకి నా మీదున్న కోపం తాలూకూదని తెలిసిపోతోంది.

తరచూకాకపోయినా.....అప్పుడప్పుడూ రాజశేఖరంగారు నాకు లిఫ్ట్ ఇవ్వటం అనేది జరగటం..... మారుతీరావు చూడటం....మామూలయిపోయింది.

ఒకరోజు మా వారు చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయాను.

"వసూ, మన ఎదిరింటి మారుతీరావు మీ డిపార్ట్‌మెంట్ కదూ! నిన్న పొద్దుపోయి ఇంటికి వస్తుంటే దారిలో తగిలి ఏవో అడ్డమయిన కూతలు కూసేడు. మళ్ళీ నోరెత్తకుండా చేసేననుకో. నీవు రాజశేఖరంతో కలిసి ఏదో ఫంక్షన్‌కి వెళ్ళటం గురించి అడిగాడు. అందులో తప్పేముంది.....అనంటే 'రామరామ' అంటూ చెంపలు వాయించుకున్నాడు.

"ఆడా మగ మధ్య స్నేహం ఏమిటటా...' అంటూ బుగ్గల్ని నొక్కుకోటం. అబ్బో చెప్పద్దులే! రకరకాల భంగిమల్తో నాకర్థం అయ్యేలా చెప్పేడు. అంతా విని, మా స్వవిషయాల్లో జోక్యం చేసుకోవద్దని గట్టిగా వార్నింగ్ ఇచ్చాలే".

అంత మంచి భర్త దొరికినందుకు నా మీద నాకే జెలసీ కల్గిన క్షణాలవి. మారుతీరావు, రాజశేఖరం, మా వారూ... అంతా మగవాళ్ళే. మరి వాళ్ళ భావజాలంలో ఎంత మార్పు? వీళ్ళిద్దరి సంస్కారం హిమాలయంలా కన్పిస్తుంటే మారుతీరావు సంస్కారం అధః పాతాళంలో వున్నట్లు అన్పించింది.

మారుతీరావు భార్య గుర్తొచ్చి జాలేసింది. దీన్నిబట్టి ఆలోచిస్తే మరో మగవాడి కేసి చూసినా.... అనుమానంతో భార్యని కాల్చుకుతినే రకంలా వున్నాడు.

* * *

కాలానుగుణంగా స్త్రీ మారుతున్నా, ఆధునిక జీవనం సాగిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నా మారుతీరావు లాంటి వారు ఎదుటివారి ఆరాలతో, ఇంటి గురించి పట్టించుకోకుండా తిరోగమిస్తున్నారు. బాధ్యతల్ని విస్మరించి, స్నేహితులతో బలాదూర్‌గా తిరుగుతూ జీవితాన్ని ఎంజాయ్ చేయాలనుకునే మగవాళ్ళు గొప్పతనం కోసమే తనూ మగాణ్ణనిపించుకోవటం కోసం పెళ్ళిళ్ళు చేసుకొని మరో ప్రాణిని బలి తీసుకుంటున్నారనిపిస్తోంది.

తన ఇంటి బాధ్యతల్ని మారుతీరావు ఏనాడూ పట్టించుకున్నట్లు కన్పించదు. కొన్నాళ్ళ తర్వాత మా పని మనిషి చెప్పిన విషయం విని ముందుగా ఆశ్చర్యపోయినా

ఆనక సంతోషం కల్గింది.

'పాపం! మారుతీరావు' అన్పించింది.

అందుకే కాబోలు మనిషి ఈ మధ్య ముభావంగా వుంటూ అంతగా కామెంట్స్ చేయటం లేదు.

మారుతీరావు చెల్లెలు సుశీలకు ముప్పై యేళ్ళు దాటే వుంటాయి. ఆ అమ్మాయి తెచ్చే నెల నెల జీతం తీసుకోవటం తప్పించి, ఏనాడూ కనీసం పెళ్ళి ప్రయత్నం చేసెరుగడు. పెళ్ళయితే జీతాన్ని వచ్చినవాడు తన్నుకుపోతాడన్న భయం కాబోలు.

మారుతీరావు దృష్టిలో సుశీల లేచిపోయింది. ఆమె మేజర్ కాబట్టి నోరు మూసుకుని వున్నాడు. సుశీల తనకు నచ్చిన వాడితో వేరుగా వెళ్ళిపోయి అతన్తో జీవితం పంచుకుంటుంది.

అన్న చేతగానితనాన్ని చాటింపేసినట్లుగా సుశీల వెళ్ళిపోవటం చాలా మంచి గుణపాఠం అన్పించింది.

ఆ తర్వాత ఆఫీస్‌లో వారికి ఈ విషయం తెలిసిపోయి ఒకరిద్దరు అడగబోయేసరికి మారుతీరావు తనదైన ధోరణిలో చెప్పేడు.

"మా సుశీలకు 'పెళ్ళి' అంటే గిట్టదోయ్. అనవసరపు తంతు అనేది. ఇష్టమైన వాడితో సహజీవనం. దట్సాల్! అంటుంది. నేనూ దాని ఆధునిక భావాల్ని కాదనలేక....ఊరుకున్నాను" లౌక్యంగా చెప్పి, ఒప్పించాడు అందర్నీ. మారుతీరావు వెనగ్గా....జనం చేసిన వ్యాఖ్యానాలు నా చెవుల్లో అప్పుడప్పుడూ దూరేవి. అవసరాన్ని బట్టి రంగులు మార్చే ఊసరవెల్లిలా అన్పించేడు మనిషి.

"నేను మీకేసి కన్నెత్తి చూసి మీతో మాట్లాడే అర్హతను ఏనాడో పోగొట్టుకున్నాను. అందుకే మీరు చేసిన మేలుకు మనసులోనే కొన్ని వేల సార్లు కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ముఖ్యంగా నాలాంటి వాళ్ళలో మార్పనేది చాలా అవసరంఅనిపించింది. ఇన్నాళ్ళూ నా సంస్కారానికి పట్టిన చీడని మీ మంచితనంతో, ప్రవర్తనతో తొలగించేరు. నా భావితరం నాలా కుసంస్కారంతో, బాధ్యతారహితంగా ప్రవర్తించకూడదు. అందుకే మారుతున్నాను. నన్ను క్షమించక్కర్లేదు మీరు. మీ కాళ్ళను మొక్కనివ్వండి చాలు. పునర్జన్మ ఎత్తినట్లుగా భావిస్తాను....."

మరో ఆర్నెల్ల తర్వాత ఆఫీస్‌లో వాళ్ళు దక్షిణ భారతదేశంలోని పుణ్యక్షేత్రాల్ని చూసే నిమిత్తం టూర్ ప్రోగ్రాం అరేంజ్ చేసేరు.

ఇంట్లో వాళ్ళని తీసుకెళ్ళకుండా మారుతీరావు ఒక్కడే వెళ్ళాడని తెలిసింది. ఆయన వెళ్ళిన రెండో రోజు జరిగిన సంఘటన ఇది.

ఆవేళ ఆదివారం. ఉదయం నుండే వర్షం మొదలయ్యింది. పది గంటల ప్రాంతంలో మా పనిమనిషి పరిగెత్తుకొని వచ్చింది. మనిషి కంగారుగా ఉంది. మారుతీరావు ఇంట్లోంచి రావటం చూసేను.

"వసుందరమ్మగారూ......ఆ నీలవేణమ్మగారు పడిపోయారు. కాళ్ళు చేతులూ కొట్టుకొంటున్నారు" నీలవేణి మారుతీరావు భార్య.

"ఎలా జరిగిందీ" వున్న పళంగా నేనూ, మావారూ వెళ్ళాం. నీలవేణికి ఫిట్స్ వచ్చాయి. నోట్లోంచి సొంగ కార్తోంది. మనిషి బిగుసుకుపోతూ పిడికిళ్ళు బిగిస్తోంది. ఆ దృశ్యం చూసి భయపడి పోయేను. మా వారు ఆటో కోసం పరిగెత్తారు. ఎలా తెలిసిందో విషయం.... రాజశేఖరంగారు కూడా పరిగెత్తుకొచ్చారు. పరిస్థితి గమనించి తన దగ్గరున్న తాళం చెవుల్ని ఆమె రెండు గుప్పెట్లలో పెట్టారు.

మారుతీరావు తండ్రి కాబోలు నులకమంచంలో నుండి నిర్వేదంగా మా అందరికేసి చూస్తున్నాడు.

నోరు పడిపోయి, పక్షవాతంతో రోజుల్ని లెక్కబెడుతున్న అతన్నీ, మూర్ఛరోగంతో ఉన్న నీలవేణినీ, అంతకుముందు కొన్నాళ్ళ క్రితం ఇంట్లోంచి అందర్నీ వదిలి వెళ్ళిపోయిన సుశీల.....ఇద్దరు చిన్న పిల్లల్తో......మారుతీరావు వెనక ఇంత బాధ్యత వున్నా....ఏమీ పట్టనట్లు, అసలు జీవితంలో తనకే సమస్యా లేనట్లు మరొకరి జీవితాల్లోకి తొంగి చూస్తున్నాడంటే..... 'మనిషి'గా తనెంత నికృష్టుడో తెలుస్తోంది.

వాళ్ళ రెండేళ్ళ పాపని ఎత్తుకున్నాను. వాళ్ళమ్మకు ఏమయిందో తెలీక బిత్తర పోతోంది. మరో పది నిముషాల్లో మా వారు ఆటోతీసుకుని రావటం, తనూ, రాజశేఖరంగారూ నీలవేణిని ఎత్తుకొని ఆటోలో కూర్చోబెట్టి, చెరో పక్కా కూర్చుని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. ఆమె ఆరోగ్యం కుదుట పడే వరకూ ఇద్దరూ హాస్పిటల్‌కు తిరుగుతూనే వున్నారు. నీలవేణి మరో మూడ్రోజుల దాకా హాస్పిటల్‌లోనే వుంది. ఆ మూడ్రోజులూ వాళ్ళందరికీ వంట చేసేను. మా పని మనిషితో వాళ్ళ మావయ్య అవసరాల్ని చూడమన్నాను. పిల్లలిద్దరూ నా దగ్గరే వున్నారీ మూడ్రోజులూ.

వారం రోజులు పోయేక వచ్చేడు మారుతీరావు. విషయం తెలుసుకున్నాడో, నీలవేణి చెప్పగా విన్నాడో.... తెలీదు. చాల్రోజుల దాకా మనిషి మౌనంగా వున్నాడు. ఆఫీస్‌లో కూడా ఎవరితోనూ మాట్లాడ్డం చూళ్ళేదు. చాలా ముభావంగా వున్నాడు.

కనీసం తను ఊర్లో లేనప్పుడు చేసిన ఉపచర్యలకి థాంక్స్ చెప్పాడేమో అనుకున్నాను. అసలు నాకేసి చూడటం లేదు.

నాల్గు రోజులు పోయేక నాపేర వచ్చిన ఉత్తరం చదివి ఆశ్చర్యపోయాను. మారుతీరావే రాసేడు - "వసుంధరగార్కి,

"నేను మీకేసి కన్నెత్తి చూసి మీతో మాట్లాడే అర్హతను ఏనాడో పోగొట్టుకున్నాను. అందుకే మీరు చేసిన మేలుకు మనసులోనే కొన్ని వేల సార్లు కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ముఖ్యంగా నాలాంటి వాళ్ళలో మార్పనేది చాలా అవసరమనిపించింది. ఇన్నాళ్ళూ నా సంస్కారానికి పట్టిన చీడని మీ మంచితనంతో, ప్రవర్తనతో తొలగించేరు. నా భావితరం నాలా కు సంస్కారంతో, బాధ్యతారహితంగా ప్రవర్తించకూడదు. అందుకే మారుతున్నాను. నన్ను క్షమించక్కర్లేదు మీరు. మీ కాళ్ళకు మొక్కనివ్వండి చాలు. పునర్జన్మ ఎత్తినట్లుగా భావిస్తాను....."

నా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగేయి. మారుతీరావులో మార్పు వచ్చింది. అదే నేనూ కోరింది. 'తన దాకా వస్తే' కానీ..:.. కొందరిలో మార్పు రాదన్నది మారుతీరావు విషయంలో నిజమయ్యింది. ఇక నుండయినా తన వాళ్ళ కోసం జీవితాన్ని కేటాయిస్తాడన్న ఆలోచనతో తృప్తిగా గుండె నిండిపోయింది.

●



## పాఠక 'దరహాసం'

* అయిదేళ్ల పసిపాప వాచీ పెట్టుకోవడం చూస్తాడు వెంకటరావు.

"ఏమ్మా! నీ వాచీ టైమ్ చెబుతుందా?" అడిగాడు ఆ పాపను.

"అది చెప్పలేదు అంకుల్. నేను చూసి చెప్పాలి." చెప్పింది పాప.

* ఓ రాజకీయనాయకుడు ఉపన్యాసం ఇస్తూ మధ్యలో హఠాత్తుగా ఆగి,

"అంతా ఎడమ చేతులు ఎత్తండి." అన్నాడు.

అందరూ ఎడమ చేతులు ఎత్తారు.

"ఇప్పుడు కుడిచేతులు ఎత్తండి." మళ్లీ అన్నాడు.

ఎత్తారు అంతా.

"ఏంలేదు, మీరంతా నా ఉపన్యాసం వింటున్నారో లేదో టెస్ట్ చేద్దామని!"

**--జి.వి.నాగేంద్రకుమార్, ఒంగోలు.**

* "గోపీ ఉత్తరం రాస్తే మళ్లీమళ్లీ చదవాలనిపిస్తుంది."

"అంత బాగా రాస్తాడా!?"

"అదేంలేదు. అసలు అర్థమై చస్తే కదా!"

* "మీ అన్నయ్య వెంకటేశ్వరస్వామి మొక్కు ఇన్నేళ్లవుతున్నా తీర్చలేదా! ఏం!... ఎందుకని?"

"మొక్కుబడి ప్రకారం స్వామికి మా అన్న తలనీలాలు ఇవ్వాలి. ఆయన బట్టతలకు వెంట్రుకలు వస్తే కదా ఇవ్వడానికి!"

**--గుడిపూడి శ్రీ,అమ్మనబ్రోలు,ప్రకాశంజిల్లా.**

* "ఏమిట్రా! ఇంటి బయట కూచుని తింటున్నావ్!?"

"ఏంలేదు మా నాన్న సంపాయిస్తుంటే 'ఇంట్లో కూర్చొని తినటానికి సిగ్గు లేదు' అంటూ తిట్టాడు- అందుకని."

**-కె.రాజెందర్,సిరిసిల్లా.**

### గమనిక

పాఠకులు పాఠక'దరహాసం' కోసం పంపే జోకులు తమ సొంతమేనని తప్పనిసరిగా హామీ పత్రం జతచేయాలి.